క్లుప్తంగా

మొక్కలు నాటిన అధికారులు



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

నర్సాపూర్: వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం నర్సాపూర్‌లోని ఎస్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అరవింద్ తెలిపారు. మొక్కల విశిష్టతను విద్యార్థులకు వివరించి వాటిని కాపాడే బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, లెక్చరర్లు, డిప్యూటీ రేంజ్ అధికారి సిద్ధిరాం సింగ్, సెక్షన్ అధికారి సాయిరాం చెప్పారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత



కుసంగిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): ఇందిరమ్మ ఇళ్లు నిరుపేద ప్రజలకు వరమని జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు యూసుఫ్ తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కౌశిక్, కార్యదర్శి శ్రీనివాస్ మండల్ యూత్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ , మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజయ్య పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు



వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలోని పలు కాలనీల్లో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొందని సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రమాదేవి శుక్రవారం పలు కాలనీల్లో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఇందుకు గాను పలువురు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

భవిత కేంద్రం తనిఖీ



నోట్‌బుక్స్ అందించిన ఎంఈఓ పుష్పవేణి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఎంఈఓ పుష్పవేణి తనిఖీ చేశారు. శుక్రవారం చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని పరిశీలించిన ఆమె.. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిళ్లను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఐఈఆర్‌పీ రత్నం, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ వెంకటేశం అన్నారు. శుక్రవారం పీఎంశ్రీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ కూడా చేపట్టాలన్నారు. చెట్ల వల్ల కలిగే లాభాలపై విద్యార్థులకు వివరించారు. ప్రతీ ఒక్కరూ తమ తల్లి పేరుపై ఒక మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు తదితరులున్నారు.

ఎంజేపీకి త్వరలో సొంత భవనం

తూప్రాన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న మహత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు సొంత భవన నిర్మాణం కోసం వెల్దుర్తి మండలంలో పది ఎకరాల భూమిని కేటాయించినట్లు ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్దుర్తికి చెందిన మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాల తూప్రాన్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే అన్నారు. ఇందుకోసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్దుర్తిలో సొంత భవన నిర్మాణం కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించడం సరికాదన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యా, వసతి, ఆరోగ్య, పారిశుద్ధ్య సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. తాగు నీటి సమస్య ఉందని విద్యార్థులు తెలపగా.. సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సంఘటితమై.. సాగుబాట

- రాళ్ల భూముల్లోనూ సిరుల పంట
- ఆదర్శంగా హకీంపేట అన్నదాతలు



మామిడితోటలో కలుపు మొక్కలు తొలగిస్తున్న రైతు

వెల్దుర్తి(తూప్రాన్): రాళ్ల, రప్పలతో కూడిన భూముల్లో సాగుచేయడం కంటే వదిలేయడమే మేలని భావిస్తుంటారు. పెద్ద పెద్ద రాళ్లగుట్టలు ఉంటే అటువైపు కన్నెత్తి కూడా చూడరు. బోర్లు వేసినా చుక్కనీరు పడదనే ఉద్దేశంతో వాటిని పడావుగానే ఉంచుతారు. అయితే బీళ్లుగా ఉన్న భూముల్లోనూ సంఘటితంగా ప్రయత్నిస్తే సిరులు పండించొచ్చని నిరూపిస్తున్నారు హకీంపేట అన్నదాతలు.

హల్దీ ప్రాజెక్ట్ నుంచి సాగునీరు

మాసాయిపేట మండలం హకింపేట శివారులో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో సుమారు 579 ఎకరాల సీలింగ్ భూములను నిరుపేదలకు అసైన్డ్ చేస్తూ పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూముల్లో చాలా వరకు రాళ్ల, రప్పలతో నిండి ఉండడం, సాగుకు ఆమోద యోగ్యంగా లేకపోవడంతో వాటిని రైతులు సాగులోకి తీసుకురాలేకపోయారు. రాళ్ల, రప్పలను తొలగించి సాగునీటి వసతి కల్పించడానికి అయ్యే ఖర్చు తడిసి మోపెడవుతుందని, అంతమొత్తం ఎలా సమకూర్చేది అంటూ ఆవేదనతో వాటిని పడావుగానే ఉంచారు. కలిసికట్టుగా పనిచేసుకుంటే ఖర్చుల భారం తగ్గుతుందని, తద్వారా రాళ్ల భూములను రత్నాల భూములుగా మార్చుకోవచ్చని పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి ఇచ్చిన సూచనతో సుమారు 10 మంది రైతులు దశాబ్దాల అనంతరం ఏకమయ్యారు. ఎవరి భూములను వారే చదును చేసుకున్నప్పటికీ నీటివనరులు లేక పోవడంతో సమీపంలోని హల్దీ ప్రాజెక్ట్ నుంచి అందరి భూముల్లోకి సాగునీరు చేరడానికి అయ్యే ఖర్చును కలిసికట్టుగా పోగుచేశారు. సుమారు 12 ఎకరాల్లో మామిడి చెట్లు నాటడం, డ్రిప్ ఏర్పాటు, హల్దీ ప్రాజెక్ట్‌లో బోర్‌మోటర్ ఏర్పాటు చేసి పైపులైన్‌ల కోసం రైతుల మధ్య వ్యత్యాసం లేకుండా సుమారు రూ. 4 లక్షలు ఖర్చు చేశారు. ఏళ్ల తరబడి పడావుగా ఉన్న భూముల్లో పచ్చని చెట్లు ఎదుగుతుంటే సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

> **ప్రభుత్వం తోడ్పాటు అందించాలి**
>
> 
>
> ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు సాగుకు ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ఏళ్ల తరబడి పడావుగానే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన సూచనలతో 10 మంది రైతులం ఏకమై మామిడి తోట సాగుచేస్తున్నాం. డ్రిప్‌కు, పైప్‌లైన్, మోటార్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ రాకపోవడంతో సొంతంగానే ఏర్పాటు చేసుకున్నాం. పక్కనే ఉన్న హల్దీ ప్రాజెక్ట్ నుంచి సాగునీరు అందించడానికి తోడ్పాటు అందిస్తే బీడు భూములన్నీ సాగులోకి వస్తాయి.
>
> – నాగరాజు, రైతు, హకింపేట

ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలి

బీఎంఎస్ సంఘం ఆధ్వర్యంలో కార్మికుల నిరసన



వడియారం అపోలో పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చేగుంట(తూప్రాన్): ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలని వడియారం అపోలో పైపుల పరిశ్రమ వద్ద బీఎంఎస్ సంఘం ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా బీఎంఎస్ సంఘం కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ.. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు వేతన ఒప్పందం నియమావళి ప్రకారం జీతాలు చెల్లించాల్సి ఉండగా.. యాజమాన్యం స్పందించడం లేదన్నారు. ఒప్పందం ప్రకారం జీతాలు ఇవ్వకపోవడంతో పెరుగుతున్న ఖర్చులతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ యజమానులు లబ్ధిపొందుతున్నట్లు ఆరోపించారు. వేతనాలను పెంచుకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ సంఘం నాయకులు రాజ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, చౌహాన్, సురేష్, కుమార్, నవీన్, కృష్ణ, సునీల్‌పాశ్వాన్ కార్మికులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అనేక లాభాలు



అవగాహన కల్పిస్తున్న రంగనాయకులు

చేగుంట(తూప్రాన్): ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని లివ్‌పాం రిసోర్సెస్ సంస్థ సలహాదారులు రంగనాయకులు తెలిపారు. శుక్రవారం చేగుంట రైతు వేదికలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరా వరి పండించే నీటితో ఐదెకరాల ఆయిల్‌పాం సాగు చేసేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. నాలుగేళ్ల పాటు అంతర పంటలు వేసుకుంటే ఏడాదికి ఒక ఎకరాకు 26 వేలు, రూ.450లను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం దిగుబడి ప్రారంభమైన నాటి నుంచి ఖర్చులు పోగా ఏడాదికి కనీసం లక్ష 20 వేలు లాభం పొందవచ్చునని చెప్పారు. కోతుల బెడద లేకుండా ఉండటంతో పాటు దిగుబడి వచ్చిన పంటలను సంబంధిత ఆయిల్ కంపెనీలు కొనుగోలు చేస్తాయని తెలిపారు. అని విధాలుగా ఉపయోగంగా ఉన్న ఆయిల్‌పాం పంటను సాగు చేసి రైతులు లబ్ధిపొందాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఫీల్ ఆఫీసర్ సుజాత ఎఈఓలు మాధవి, కల్యాణి, భువన పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేయండి



కాడిపల్లిలో రైతులకు మినీకిట్స్ పంపిణీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షభావ పరిస్థితుల కారణంగా వరి పంటకు బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఏఓ స్వప్న తెలిపారు. జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా శుక్రవారం కౌడిపల్లిలో పలువురు రైతులకు మినుములు, జొన్న విత్తనాల మినీకిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో జూన్‌లో 15 ఎంఎం, జూలైలో ఇప్పటి వరకు 88 ఎంఎం వర్షాపాతం మాత్రమే కురిసిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో రైతులు వరి పంట సాగు చేస్తే నీరందక ఇబ్బందులు పడుతారని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మినుములు, జొన్న పప్పుదినుసులు, చిరుధాన్యాలు సాగు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సాహితి, సృజన తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

ఎంపీడీఓ కలీముల్లా



అజ్జమర్రిలో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న దృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ కలీముల్లా అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్ మండల గ్రామాలలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో ఇంట్లో ఉన్న డ్రమ్ములు, టైర్లు, పాడేసిన కొబ్బరిబొండాలు, ఖాళీ సీసాలు, పాడైన కూలర్లలో నీటి నిల్వ అయ్యేందుకు అవకాశం ఉంటుందని, ఆ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. తద్వారా దోమలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. మురికి కాలువల్లో బ్లీచింగ్, మురికి గుంటల్లో అయిల్‌బాల్స్ వేయించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

అటవీశాఖ అధికారి అర్చన



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంతం ఉన్నత పాఠశాలలో మెదక్ అటవీశాఖ కౌడిపల్లి రేంజ్ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అటవీశాఖ అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌడిపల్లి రేంజ్ ఎఫ్ఆర్‌ఓ అర్చన మాట్లాడుతూ.. భూమిపై 33 శాతం అటవీ ప్రాంతం ఉండాలన్న లక్ష్యంగా వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రేంజ్ పరిధిలోని కౌడిపల్లి, కొల్చారం మండలాల్లోని అన్ని పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరిత తెలంగాణగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణరావు, కొల్చారం, అంసాన్పల్లి అటవీశాఖ సెక్షన్ అధికారులు శ్రీహరి ప్రసాద్, జలీల్, పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, నాయకులు సంతోష్ రావు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌బీఐ సీజీఎం సింగల సుబ్బయ్య



మాట్లాడుతున్న ఆర్బీఐ సీజీఎం సింగల సుబ్బయ్య

మెదక్ కలెక్టరేట్: డిజిటల్ మోసాలపై ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బిఐ) సీజీఎం సింగల సుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో డిజిటల్ మోసాలు, పరిష్కారాలు, వినియోగదారుల హక్కులపై శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన మోసాల విషయంలో పరిష్కరించడానికి ఆర్‌బీఐ అంబుడ్స్‌మెన్ పథకం రూపొందించినట్లు తెలిపారు. అలాగే వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, డిజిటల్ లావాదేవీలలో భద్రతా చర్యల గురించి వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధన

ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలరాజు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉదయం ప్రార్థన సమయానికి పాఠశాలకు వెళ్లారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతోపాటు రిజిస్టర్లు పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల విద్యాబోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మంజుల పాల్గొన్నారు.

ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు

నర్సాపూర్: ముస్కాన్ ఆపరేషన్‌లో భాగంగా శుక్రవారం నర్సాపూర్‌లో అధికారుల బృందం తనిఖీలు చేయగా రెండు వ్యాపార సంస్థల్లో ఇద్దరు బాల కార్మికులతో పని చేయిస్తున్నట్లు గుర్తించారు. ముస్కాన్ బృందంలో స్థానిక అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి నాగరాజు, పోలీసు శాఖ ఉద్యోగులు మోహన్, యాదగిరి, రమేష్ ఉన్నారు. వారు పట్టణంలోని శ్రీసాయిరాం మోటార్స్ సంస్థలో, తాజ్ హోటల్‌లో బాల కార్మికులు ఉన్నట్లు గుర్తించారు. సాయిరాం మోటార్స్ యజమాని బండ నందు, తాజ్ హోటల్ యజమాని షేక్ అలీలపై ముస్కాన్ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ లింగం చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో మెదక్ పోలీసులు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ప్రతినిధి సురేందర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం ఎక్కువగా జరుగుతున్న పరిస్థితుల్లో వాటికి దూరంగా ఉండాలన్నారు. ఉత్తమ విద్యను అభ్యసించి భావిపౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు చంద్రయ్య, పార్టీ నాయకులు రాజు, రాంరెడ్డి, బాల్‌రాజ్, కృష్ణ, మహేందర్‌గౌడ్ తదితరులు పట్టణంలోని చాలా వార్డులలో నల్లాల ద్వారా సరిపడా నీరు రావడం లేదని, దోమల బెడద పెరిగిందని, చెత్త సక్రమంగా సేకరించడం లేదన్నారు. దేవాలయం భూములలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, ఇంకా పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు.

◆ ఆధునిక పద్ధతులు అవలంబించాలి

వెల్దుర్తి(తూప్రాన్): ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా రైతులు పంటలు పండించి అధిక దిగుబడులు సాధించాలని ఏఈఓ మజీద్ సూచించారు. మండలంలోని ఉప్పులింగాపూర్‌లో తెగుళ్ల నివారణకు అవలంబిం పీఎస్‌బీ (పాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా) విధానంపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. గా నాటు వేసే ముందు వరి నారు చివర ఆకులని కత్తిరించి లేదా తుంచి నాటు వేయాలని సూచించారు.

◆ పరిసరాల పరిశుభ్రత పాటించండి

చిన్నశంకరంపేట(మెదక్): వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ దామోదర్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పరిసరాలను పరిశీలించారు. ఇంటి పరిసరాలలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీ ఈఓ ప్రదీప్, సీహెచ్‌ఓ యాదగిరిరావు ఉన్నారు.

వడ్డీ లేని రుణాలపై కళా ప్రదర్శన



అహ్మద్‌నగర్‌లో కళాకారుల ప్రదర్శన

నర్సాపూర్ రూరల్: మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలపై శుక్రవారం నర్సాపూర్, ఖాజీపేట, అహ్మద్ నగర్ గ్రామాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. మహిళలందరూ సంఘాల్లో చేరాలని, వృద్ధులు, కిశోర బాలికలు, వికలాంగులు మహిళలను గుర్తించి సంఘాల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలను అందిపుచ్చుకొని ఉపాధి పొందాలని, ఆటపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆర్డినేటర్ కృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు వెంకటేష్, యాదయ్య, ఏపీఎం గౌరీశంకర్, సీసీలు ప్రవీణా, రవీందర్, కళాకారుల బందం సభ్యులు రామారావు, ఎల్లయ్య, నర్సయ్య, జై లక్ష్మీ మాధవి లు పాల్గొన్నారు.

దళితులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు డీబీఎఫ్ నేతల వినతి



కమిషనర్ వెంకటయ్యకు వినతిపత్రం ఇస్తున్న డీబీఎఫ్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి బిజ్లిపూర్‌లో దళితులను దూషించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీబీఎఫ్ నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషనర్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 6న గ్రామంలో పలువురు వ్యక్తులు దళితులను దూషించడమే కాకుండా దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయలేదన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని బాధితుల పట్ల ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కమిషనర్ చైర్మన్.. తూప్రాన్ డీఎస్పీతో మాట్లాడారని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

మెదక్ ఆర్‌డీఓ రమాదేవి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు కొత్త ఓటర్లను నమోదు చేయాలని మెదక్ ఆర్‌డీఓ రమాదేవి సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో బీఎల్‌ఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితాను బాధ్యతతో రూపొందించాలని కోరారు. తప్పులేని ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్‌ఓలదే కీలక పాత్ర అన్నారు. మరింత మెరుగైన ఓటరు జాబితా రూపకల్పన కోసం శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ శిక్షణతో మరింత ఆరోగ్యకరమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని మెదక్ ఆర్‌డీఓ రమాదేవి సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆమె మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన వడ్డించారు. అనంతరం అన్నం పరిశీలించారు. మోడల్‌స్కూల్‌కు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయపాత్ర నిర్వాహకులతో మాట్లాడి విద్యార్థులకు మరింత మెరుగైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ మాలతి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారికి సూచించారు.

ఉపాధ్యాయులా? రియల్ ఎస్టేట్ ఏజెంట్లా...?

- ఎమ్మార్పీఎస్ నేతల ధ్వజం
- వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసువాలని డీఈఓకు ఫిర్యాదు



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న కొంతమంది బోధనను పక్కనబెట్టి సొంత ప్రయోజనాల కోసమే డిప్యూటేషన్లు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల సెటిల్మెంట్లు చిట్టి వ్యాపారాలు సాగిస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డీఈఓ రాధాకిషన్‌కు ఫిర్యాదు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్షకు పైగా ప్రభుత్వ జీతాలు తీసుకుంటూనే విద్యాబోధన పక్కనబెట్టి వ్యాపారాలు సాగిస్తున్నట్లు ఆరోపించారు. పేద పిల్లలకు చదువు సక్రమంగా బోధించలేని ఉపాధ్యాయులను గుర్తించాలని కోరారు. అలాంటి ఉపాధ్యాయులను తక్షణమే గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలరాజు, మల్‌శెట్టి రవి, ఎస్సీ ఎస్టీ బీసీ ఐక్యకార్యాచరణ సమితి, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కృష్ణ, యేసుదాస్, రవికుమార్, కుమార్, లక్ష్మణ్, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.